ప్రజాశక్తి

సోమవారం 19 డిసెంబర్ 2022 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

బదిలీల దరఖాస్తులకు

తొలగని చిక్కులు

- నేటితో ముగియనున్న గడువు
- వైద్య ధ్రువీకరణ పత్రాలు అందక ఇబ్బంది

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువును సోమవారం వరకు పొడిగించారు. ఇప్పటి వరకు 2 వేల మంది వరకు బదిలీకి దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. టీచర్ల సమాచార నిధి (టీచర్ ఇన్‌ఫర్ మెషన్ సిస్టమ్) నమోదులో చోటుచేసుకున్న కొన్ని తప్పులు ఉపాధ్యాయులకు తలనొప్పిగా మారాయి. ఉపాధ్యాయుల సర్వీసు రికార్డులో ఉన్న సమాచారానికి, టీచర్ల సమాచార నిధిలో ఉన్న సమాచారానికి పొంతన లేదని కొంత మంది వాపోతున్నారు. కొందరు ఉపాధ్యాయుల పుట్టిన తేదీలు, సర్వీసులో ప్రవేశించిన వివరాలు, బదిలీలు, ప్రమోషన్లు పొందిన వివరాలు ఈ సైట్‌లో ఒక విధంగా, ఉద్యోగి సర్వీసు రిజిస్టర్‌లో మరో విధంగా ఉన్నాయని చెబుతున్నారు. తప్పులను సరిచేసుకంటూ దరఖాస్తు చేసుకోవడానికి సమయం ఎక్కువగా పడుతుందంటున్నారు. ఔ

మరోవైపు జిల్లాలో ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల పాఠశాలల్లో సర్దుబాటు తర్వాత నిబంధనల ప్రకారం 3 వేల మందికి పైగా బదిలీకి అవకాశం ఉంది. నూతన విద్యా విధానం అమలులో భాగంగా 3, 4, 5 తరగతులను సమీప హైస్కూల్సులో విలీనం చేయడం వల్ల జిల్లాలో ఇప్పటికే 1400 మంది



ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. మరో 1600 మందికి బదిలీకి అవకాశం ఉంటుందని తెలిసింది. అయినా ఇప్పటికీ చాలా పాఠశాలల్లో టీచరు, విద్యార్థుల నిష్పత్తిలో ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇప్పటికీ ఇబ్బంది పడుతున్నారు.

వైద్య ధ్రువీకరణ పత్రాలు అందక చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఆస్పత్రిలో వైద్యుల నుంచి ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదని ఇందువల్ల వైద్య సమస్యలున్నా దరఖాస్తు చేసుకోలేకపోతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తున్నారు. ఐదేళ్ల ఒక చోట పనిచేసిన ప్రధాన ఉపాధ్యాయులు, ఎనిమిదేళ్ల ఒకేచోట పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీకి అర్హులుగా నిర్దేశించారు. ఉపాధ్యాయుల వినతిపై ఎట్టకేలకు సోమవారం వరకు దరఖాస్తుకు అనుమతించడంతో మరికొంత మంది దరఖాస్తుకు అవకాశం దక్కింది.

దరఖాస్తుల పరిశీలన 26 వరకు జరుగుతుంది. 27వతేదీ నుంచి ఖాళీగా ఉన్న స్థానాలను కోరుకునే అవకాశం కల్పించారు. బదిలీల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి వచ్చే నెల 11 నుంచి కొత్త స్థానాలకు వెళ్లేలా కార్యచరణ సిద్ధం చేశారు. మరోవైపు బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురవుతున్న తమకు రేషనలైజేషన్ పాయింట్లు సక్రమంగా అమలు చేయడంలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఖాళీల జాబితాపై ఇంకా అస్పష్టత నెలకొంది. పాఠశాలలో ఉన్న ఖాళీలను పూర్తిగా చూపిస్తారనే నమ్మకం లేదని బదిలీకి అర్హతున్న ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రధానోపాధ్యాయులకు రూపొందించిన రోస్టర్ పాయింట్ల అంశంపైనా వారిలో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.



కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

వైసిపికి ప్రజాసమస్యలు పట్టవు

- వారాహిపైనే పర్యటిస్తా.. ఎలా ఆపుతారో చూస్తా..
- బీసీలకు భోజనం పెడితే సాధికారత వస్తుందా?
- టిడిపి, బిజెపిలకు తొత్తును కాదు
- దూళిపాళ్ల కౌలురైతు భరోసా యాత్రలో పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి/ సత్తెనపల్లి రూరల్

రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోతున్నారు.. ఆదుకోండీ అంటే వైసిపి నేతలు నా వ్యక్తిగత జీవితంపైనా, పర్యటించే వాహనం రంగులపైనా విమర్శలు చేస్తారు.. అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. రైతు భరోసా యాత్రలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం దూళిపాళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆత్మహత్యలకు పాల్పడిన కౌలురైతులకు చెందిన 210 కుటుంబాల వారికి ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం రూ.2.10 కోట్ల చెక్కులను పవన్ కల్యాణ్ ఆదివారం పంపిణీ చేశారు. అంతకు ముందు ఆయన మంగళగిరి నుంచి రోడ్డు మార్గంలో ఏటుకూరు, చుట్టుగుంట, నల్లపాడు, పేరేచర్ల, మేడికొండూరు, కంటెపూడి, సత్తెనపల్లి మీదుగా దూళిపాళ్ల గ్రామానికి చేరుకున్నారు.

దారి పొడవునా ఆయనకు జనసేన కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. భారీగజమాలలతో ప్రొక్లెయిన్ ద్వారా ఆయన మెడలో వేసేందుకు ఆయా గ్రామాల్లో కార్యకర్తలు పోటీ పడ్డారు. పూల వర్షం కురిపించారు. టాప్‌లేని వాహనంలో ఆయన నిలబడి అభిమానులకు అభివాదం చేశారు. దూళిపాళ్ల వేదికపై 210 మంది కౌలు రైతుల పేర్లను జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చదవగా వారి కుటుంబ సభ్యులకు రూ.లక్ష చెక్కులను పవన్ కల్యాణ్ ▶ 2లో



4కె వాక్‌లో ఉపాధ్యాయులు, వారి పిల్లలు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ 4కె వాక్

ప్రజాశక్తి-గుంటూరు

సిపిఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఆదివారం గుంటూరులో ఉపాధ్యాయులు 4కె వాక్ నిర్వహించారు. స్థానిక గుజ్జనగుండ్ల సెంటర్ నుండి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ జరిగిన ఈ వాక్‌ను గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యాయులతో కలిసి నడకలో లక్ష్మణరావు పాల్గొన్నారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులతోపాటు, వారి కుటుంబ సభ్యులు, చిన్నారులు కూడా వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే నాలుగైదు రాష్ట్రాలు సిపిఎస్ నుండి వైదొలగాయని, హామి ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం మూడున్నరేళ్లుగా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. సిపిఎస్ స్థానంలో ఓపిఎస్‌ను ఉద్యోగులు అంగీకరించట్లేదన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి సిపిఎస్ రద్దు చేయాలన్నారు. ఇప్పటికే ఉన్న 1.80 లక్షల మంది ▶ 2లో

సొంత భూముల్లో మొక్కలు పెంచుకోవచ్చు

- నిషేధిత కలప విక్రయాలకు అనుమతి తీసుకోవాలి
- మంగళగిరి, పేరేచర్ల నగర వనాల అభివృద్ధి
- ఆయా శాఖలకే మొక్కల పెంపకం బాధ్యత
- ప్రజాశక్తితో జిల్లా సామాజిక అటవీ శాఖాధికారి మహబూబ్ బాష

8లో

ఇంటర్వ్యూ



వినుకొండలో కార్మిక ప్రదర్శన

4లో

కార్మిక ద్రోహులకు బుద్ధి చెబుతాం

సిఐటియు పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ ప్రారంభంలో రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు - భారీ ర్యాలీ, బహిరంగ సభ

తలుపుతడితే 'క్వార్టర్'

అమరావతి మండలంలో బెల్ట్‌షా'ఫుల్'





ప్రజాశక్తి - అమరావతి

మండలంలో మంచినీళ్లు దొరకని గ్రామాలు న్నాయే మోగాని, మద్యం దొరకని గ్రామాలు ఉన్నాయనడం అతి శయోక్తి కాదనిపిస్తుంది. ఎందుకంటే, పరిస్థితి ఆవిధంగా ఉంది. మండలంలో ప్రభుత్వ వైన్ షాపుల సంఖ్య ఏడు. అమరావతిలో నాలుగు, 14వ మైలు రెండు, దిడుగులో ఒక మద్యం షాపు ఉన్నాయి. అయితే, ఆయా వైన్ షాపుల్లో మద్యం పక్కదారి పడుతోంది. మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో ఎప్పుడంటే అప్పుడు మద్యం లభిస్తోంది. ఆయా గ్రామాల్లోని కిరాణా, కూల్‌డ్రింక్స్ విక్రయించే దుకాణాల్లో గుట్టుచప్పుడు కాకుండా మద్యం అమ్మకాలు జోరుగా సాగు తున్నాయి. ప్రభుత్వ వైన్ షాపుల్లో పని చేసే వారికి కొద్దో గొప్పో డబ్బులు అదనంగా చెల్లించి, ఒకట్రెండు కేసుల మద్యం తీసుకొచ్చి ఆయా దుకాణాల నిర్వాహకులు వారి గ్రామాల్లో అమ్ము కుంటున్నారు. ప్రభుత్వ వైన్స్ షాపులలోని కొందరు సేల్స్ బాయ్స్ అదనపు డబ్బులకు కక్కుర్తిపడి దొంగ చాటుగా మద్యం అమ్ముతున్నారని ఆరోపణ. క్వార్టర్ బాటిల్‌పై ఉన్న ధరకు అదనంగా పది రూపాయలను చిల్లరకొట్లు, కూల్‌డ్రింక్స్ దుకాణాల నిర్వాహకులు వారి కిస్తున్నట్లు సమా చారం. కొన్ని పంచాయతిల్లో ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు, మరికొన్ని గ్రామాల్లో ఎప్పుడైనా సరే తలుపు తడితే మద్యం దొరుకుతోంది. క్వార్టర్ బాటిల్ అసలు ధరతో పాటు సుమారు ముప్పై నుంచి నలభై రూపాయల వరకు అదనంగా బెల్ట్‌షాపుల నిర్వా హకులు తీసుకుంటున్నారు. కొందరు అవినీతి అధి కారులు, స్థానిక నాయకుల ప్రోద్బలం వల్లే ఇలా విచ్చల విడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి, వారికి నెల వారీ మామూళ్లు అందు తుండటంతో బెల్ట్‌షాపుల నిర్వాహకులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఉన్నతాధి కారులు తనిఖీలు చేసేందుకు వస్తున్నారనే సమాచారం మద్యం అక్రమ విక్రయదారులకు ముందుగానే చేరవేస్తున్న ఇంటి దొంగలు ఉన్నంతకాలం అక్రమ అమ్మకాలు జరుపు తూనే ఉంటారు. సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా సోదాలు నిర్వహించి చేతులు దులుపుకోవడం తగదని ప్రజలు, ముఖ్యంగా మహిళలు మండిపడు తున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపులపై నిఘా ఏర్పాటు చేసి, సోదాలు నిర్వహించాలని ప్రజలు కోరు తున్నారు.

వైసిపికి ప్రజాసమస్యలు పట్టవు



గజమాలలో నుండి అభివాదం చేస్తున్న పవన్

(మొదటి పేజీ తరువాయి)

అందించారు. బాధిత కుటుంబ సభ్యులను పలకరించి హత్తుకుని వారితో ఫొటోలు దిగి వారికి ధైర్యం చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత మూడేళ్లలో ఆత్మహత్య చేసుకున్న 281 మంది కౌలు రైతులకు చెక్కులు అందజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించగా 210 కౌలు రైతుల కుటుంబాలు ఈ సభకు వచ్చాయి. వారి కుటుంబ పరిస్థితిని పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకుని పిల్లల చదువుకు భరోసా నిచ్చారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ వారాహి వాహనంపై తాను పర్యటిస్తానని, తనను ఎవరు ఆపుతారో చూస్తానని సవాల్ చేశారు. 2014లో రాష్ట్రంలో ప్రతిపక్షాలు వేర్వేరుగా పోటీ చేయడం వల్ల అప్పట్లో వైసిపి గెలిచిందని, ఈసారి అలా జరగదని అన్నారు. అణగారిన వర్గాలకు అధికారం అంటే అప్పటికే అధికారంలో ఉన్న కులాలను తగ్గించడం కాదని, తనకు ఎల్లలు లేవని, కులం, మతం, ప్రాంతాలకు తాను అతీతమని చాటిన విశ్వనరుడు గుర్రం జాషువాను అమితంగా ఇష్టపడే వ్యక్తినని అన్నారు. అయితే క్షేత్ర స్థాయి విషయాలు, వాస్తవ పరిస్థితి గురించి నిర్భయంగా మాట్లాడాలని, అందుకే కులాల గురించి మాట్లాడాల్సి వస్తోందని చెప్పారు. ఇప్పటి వరకు అధికారానికి దూరంగా ఉన్న కులాలకు కచ్చితంగా అధికారం అందేలా చూడాలన్నారు. దానికోసం అన్ని కులాలను కలుపుకొని వెళ్తామని చెప్పారు. తాను విశాఖలో తూర్పు కాపులతో సమావేశం కాగానే వీళ్లకు బీసీల గర్జన గుర్తొచ్చిందని, బీసీల సాధికారత కోసం చేసిందేముందని ప్రశ్నించారు. వారికి నాన్‌వెజ్ వంటకాలతో భోజనం పెడితే సరిపోతుందా అని ప్రశ్నించారు. బీసీల్లో ఎంతమంది పారిశ్రామికవేత్తలు ఉన్నారని అన్నారు. కాపులు, ముస్లిములు సైతం వెనుకబడ్డారని, వారిని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో ఆలోచించాలని కోరారు.

అంబటిపై విమర్శలు

రైతులకు ప్రభుత్వం సహాయం అందించదు. రూ.7 లక్షలు వచ్చే రైతులు వద్దకు వెళ్లి దానిలో రూ.2 లక్షలు ఇవ్వాలంటూ అవినీతి చేసే వారిని ఏమనాలి..? శవాల మీద పేలాలు ఏరుకునే విధంగా ఉంది అధికార ఎమ్మెల్యే తీరు.. అంటూ మంత్రి అంబటి రాంబాబుపై విమర్శలు గుప్పించారు.

వయోపరిమితి పెంచుతాం

వైసిపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ మీద మాట తప్పిందని, పోలీసు ఉద్యోగాలు సుమారు మూడున్నరేళ్ల తర్వాత తీశారని అన్నారు. దీనికి ఎప్పటినుంచో సన్నద్ధమవుతున్న యువత వయసు దాటిపోయి ఇప్పుడు ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు. వారి భవిష్యత్తుకు ఎవరు సమాధానం చెబుతారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వయోపరిమితి పెంచుతామన్నారు. తాను ఎవరికి కొమ్ము కాయాల్సిన అవసరం లేదని, టిడిపి, బిజెపికి తొత్తును కాదని అన్నారు.

మాచర్ల ఘటనలు మళ్లీ జరగవచ్చు

వైసిపి ఓటమి భయంతో ఏమైనా చేయొచ్చని, మాచర్ల లాంటి విధ్వంస ఘటనలు మళ్లీ ఇతర ప్రాంతాల్లోనూ జరగవచ్చని పవన్ కల్యాణ్ సందేహం వ్యక్తం చేశారు. వైసిపి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాసయాదవ్, సీనియర్ నాయకులు కల్యాణం శ్రీనివాసరావు, నాయబ్ కమల్, బొలిశెట్టి సత్యనారాయణ, పెదపూడి విజయకుమార్, చిల్లపల్లి శ్రీనివాస్, పోతిన మహేష్, గాదె వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి తవిటి భావన్నారాయణ, బొర్రా అప్పారావు, ప్రసంగించారు.

సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ 4కె వాక్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులకు తోడు, సుమారు 1.30 లక్షల మంది సచివాలయ ఉద్యోగులు కూడా సిపిఎస్ పరిధిలోకి వస్తున్నారని, అందరూ కలిసి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం ఛైర్మన్ యం.హనుమంతరావు మాట్లాడుతూ జనవరి నుండి పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్, సిపిఎస్ జిల్లా కన్వీనర్ సిహెచ్.ఆదినారాయణ, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, జిల్లా కార్యదర్శులు ఎండి.షకీలాబేగం, జి.వెంకటేశ్వరరావు, యం.గోవిందు ప్రసంగించారు.

ముగిసిన మోంట్‌ఫోర్ట్ స్పోర్ట్స్



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న మోంట్‌ఫోర్ట్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. పాఠశాల స్థాయి నుండే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే భవిష్యత్తులో మంచి క్రీడాకారులుగా రాణించవచ్చని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్ప రెడ్డి మాట్లా డుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు విద్యార్థులకు ఆనందాన్ని, ఉత్తేజాన్ని, కలిగించాయని తెలిపారు. వీటిని స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా పోటీల విజేతల వివరాలను ప్రకటించారు. భాస్కెట్‌భాల్ బాలుర విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం సాధించగా వి.పి సిద్దార్ధ పబ్లిక్ స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. బాలికల విభాగంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజేతగా నిలవగా, యన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. వాలీబాల్‌లో బాలుర విభాగంలో మోంట్‌ఫోర్ట్ స్కూల్ ప్రథమ స్థానం, వియస్ సెయింట్ జాన్స్ స్కూల్ ద్వితీయ స్థాణం సాధించాయి. టేబుల్ టెన్నిస్ బాలుర విభాగంలో యన్ఎస్యం పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థానం, వి.పి. సిద్దార్ధ పబ్లిక్ స్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. బాలికల విభాగంలో యన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ విజేతగా నిలిచింది. బ్యాడ్మింటన్‌లో బాలికల విభాగంలో ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ ప్రథమ స్థాణం సాధించగా వి.పి. సిద్దార్ధ స్కూల్ ద్వితీయ స్థాణం సాధించి అనంతరం అథ్లెటిక్స్ పోటీలలో విజేతలకు బహుమతనులను అందచేశారు.



జెవివి ఆధ్వర్యంలో ఉచిత షుగర్, బిపి వైద్య శిబిరం

ప్రజాశక్తి-తిరువూరు: జనవిజ్ఞానవేదిక(జెవివి) ఆధ్వర్యంలో తిరువూరు నాగార్జున ఉన్నత పాఠశా లలో ఆదివారం నిర్వహించిన షుగర్, బిపి రెగ్యులర్ వైద్య శిబిరానికి.1100 మంది రోగులు హాజరయ్యారు. ఈసం దర్భంగా వైద్యులు మాట్లాడుతూ కేవ లం మందులు వాడటంవల్ల మాత్రమే బి పి, షుగర్ అదుపులో ఉండవని, ఆ హారంలో మార్పులు, శారీరక శ్రమ వంటి వాటి ద్వారానే అదుపులో ఉం చుకోవ చ్చని తెలిపారు. రెండు తెలు గు రాష్ట్రా ల నుండి వచ్చిన 1100 మంది రోగుల కు మూడు నెలలకు సరిపడ మందు లు, ఇన్సులిన్ అంద జేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు వల్లభనేని రవీంద్ర, సత్యతేజ, రాజేశ్వ రి,70 మంది జెవివి వాలంటీర్లు పాల్గొ న్నారు



శ్రీనివాస రామానుజన్ టాలెంట్ టెస్టుకు అపూర్వ స్పందన

ప్రజాశక్తి-జగ్గయ్య పేట : ప్రపం చ మేధావి, భారతీయ ముద్దుబిడ్డ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరిం చుకొని ఆదివారం పట్టణంలోని జేఆర్సి విద్యాసంస్థల ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ 2022 నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్ నియోజకవర్గ స్థాయిలో 23 పాఠశాలలో 450 మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి బి. గాయత్రి, ద్వితీయ బహుమతి భాను కిరణ్ చెగు విద్యాలయం విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 5000 రూపాయలు, రెండవ బహుమతి 3000 రూపాయలు, మూడో బహుమతి 2000 రూపాయలు మరియు షీల్డ్ మరియు దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. మరియు 20 మందికి కన్సోలేషన్ తో పాటు ఒక్కొక్కరికి 500 రూపాయల చొప్పున, ప్రతి స్కూల్ నుండి టాపర్ గా ఉన్న విద్యార్థికి జ్ఞాపకలను కళాశాల ప్రెసిడెంట్ రంగాపురం నరసింహారావు, కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ పి వెంకట రాజీవ్ వీడియో సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె వెంకటేశ్వర్లు, టాలెంట్ టెస్ట్ కో ఆర్డినేటర్ జె ఆర్ సి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కెఎన్ రమేష, విశ్వ భారతి అంబానీ కళాశాల ప్రిన్సిపాల్ జే తిరుపతిరావు సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : మండల పరిధిలోని కంభంపాడు గ్రామంలో సొసైటీ కార్యాలయంలో మాతృభూమి సేవా సొసైటీ, శ్రీ వాసవీ మహిళా స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరంను జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మెడికల్ క్యాంపులు నిర్వహించటం గొప్ప విషయం అని పేర్కొన్నారు. వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, నంబూరి శ్రీనివాసరావు, ఉయ్యూరి అప్పారావు, చావా శాంతిబాబు, పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా ఏకలవ్య ఆదర్శ పాఠశాలల క్రీడా పోటీలు

జిమ్నాస్టిక్స్‌లో తెలుగురాష్ట్రాల విద్యార్థుల హవా - ప్రత్యేక హైలెట్‌గా బాక్సింగ్ పోటీలు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్, ఎఎన్‌యు

ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ స్థాయి క్రీడా పోటీలు నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల, పటమట ఇండోర్ స్టేడియం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో బాల బాలికలకు బాక్సింగ్ పోటీలు జరిగాయి. బాక్సింగ్ పోటీల సందర్భంగా రింగ్‌లోని బాక్సర్‌లను ఉత్తేజపరుస్తూ తోటి క్రీడాకారులు అరుపులతో ఇండోర్ స్టేడియం హెూరెత్తించారు. జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి.

జిమ్నాస్టిక్స్...

అండర్ -14 బాలురు ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ నుండి వి.లక్ష్మణ్ ప్రథమ స్థానం సాధించగా, మహారాష్ట్రకు చెందిన కె.క్రోనాల్ ద్వితీయ స్థానం, మధ్యప్రదేశ్‌కు చెందిన బి.ఆదిత్య మూడవ స్థానం సాధించారు. బాలికల విభాగంలో బి.అమూల్య (తెలంగాణ), కె.తేజస్వి (ఆంధ్రప్రదేశ్), ఎం.జ్యోతిక (తెలంగాణ) వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించారు. అండర్ -19 విభాగంలో బాలుర విభాగంలో బి.రాజు (మధ్యప్రదేశ్), జె.చిరంజీవి (ఆంధ్రప్రదేశ్), డి.దేవ్ (మధ్యప్రదేశ్)మొదటి మూడు స్థానాలు సాధించగా, బాలికల విభాదంలో ఎ.వైష్ణవి (తెలంగాణ), పి.సావిత్రి (ఆంధ్రప్రదేశ్), అంకిత (మహారాష్ట్ర) మొదటి మూడు స్థానాలు సాధించారు.





కబడ్డీ ...

కబడ్డీలో బాలుర విభాగంలో పూల్ ఏ మొదటి మ్యాచ్‌లో తెలంగాణ - ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 98-17 పాయింట్ల తేడాతో తెలంగాణ ఘన విజయం సాధించింది. పూల్ బీ రెండవ మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 68-34 పాయింట్లతో ఛత్తీస్‌ఘడ్ విజయం సాధించింది. బాలికల



విభాగంలో తెలంగాణ - మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 77-25 పాయింట్లతో తెలంగాణ జట్టు విజయం సాధించింది.

టేబుల్ టెన్నిస్...

అండర్ -14 బాలుర సింగిల్స్‌లో ఉత్తరాఖండ్ - ఒడిసా జట్ల మధ్య జరిగిన పోటీలో ఉత్తరాఖ:డ్ జట్టు విజయం సాధించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన సూర్యాంశ్ చౌహాన్ , ఒడిసాకు చెందిన లోకేష్ అట్టాకపై 11-8, 11-3, 11-3 పాయింట్లతో విజయం సాధించాడు. మరో మ్యాచ్ గుజరాత్ - మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 3-0 తేడాతో విజయం సాధించింది. గుజరాత్‌కు చెందిన రథ్వ జయదీప్ కుమార్ మధ్యప్రదేశ్‌కు చెందిన నితేష్ దోడ్వాపై 114, 11-5, 11-7 పాయింట్లతో విజయం సాధించారు.








జమిలి ఎన్నికలతో రాష్ట్రాల ఉనికికే ప్రమాదం

అవగాహన సంస్థ చర్చాగోష్టిలో వక్తలు

ప్రజాశక్తి - గుంటూరు

దేశమంతటా ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే అది పార్లమెంటరీ వ్యవస్థకు పెను విఘాతంగా మారుతుందని, సమైఖ్య స్ఫూర్తిని ప్రమాదంలోకి నెట్టివేస్తుందని అవగాహన సంస్థ నిర్వహించిన చర్చాగోష్టిలో వక్తలు అభిప్రాయపడ్డారు. అరండల్ పేటలోని అవగాహన కార్యాలయంలో వివాదాస్పద జమిలి ఎన్నికల అంశంపై చర్చ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ చర్చలో విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య మాట్లాడుతూ భారత సమైఖ్య స్ఫూర్తికి సమాధి కట్టి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగించే వివాదాస్పద జమిలి ఎన్నికల అంశం మరోమారు తెరపైకి వచ్చిందన్నారు. భౌగోళికంగానూ, ప్రజాజీవన విధానం లోను అడుగడుగునా భిన్నత్వంతో తొణికిసలాడుతూ ఏకత్వాన్ని చాటే విశిష్టమైన లక్షణం భారత్ సొంతమని ఒకే దేశం - ఒకే విధానం అంటూ దేశాన్ని క్రమక్రమంగా కేంద్రీకతంవైపు తీసుకువెళ్లాలని చూడటం మంచిది కాదన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ ఎస్ రవిబాబు మాట్లాడుతూ జమిలి ఎన్నికలు జరిగితే రాష్ట్రాల ఉనికికే ప్రమాదం వాటిల్లక తప్పదని దేశవాళీ ప్రచారాల్లో ప్రాంతాల వారి సమస్యలు కొట్టుకుపోతాయన్నారు. ప్రాంతీయ పార్టీలు ఉనికి కోల్పోయి క్రమంగా కొన్ని పార్టీలే మిగిలి బహుళ పార్టీ వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ జమిలి ఎన్నికలు జరగాలంటే దేశంలోని అన్ని శాసనసభలను ఒకేసారి రద్దు చేయాలని లేదా కొన్ని శాసనసభలను ముందస్తు ఎన్నికలకు ఒప్పించాలని అన్నారు. చర్చల్లో మల్లేశ్వరరావు, సి సుబ్బారెడ్డి, మురళీకృష్ణ ప్రసంగించారు.



మాట్లాడుతున్న డాక్టర్ నాగార్జున

గుండె జబ్బులకు జీవన విధానమే కారణం

ప్రజాశక్తి-గుంటూరు

గుండె జబ్బులకు దూరంగా ఉండాలంటే జీవన విధానం మారాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవటం, ఒత్తిడి, ఆందోళన లేని జీవితం గడపాలని సంజీవి హార్ట్ క్లినిక్ అధినేత, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గొట్టిపాటి నాగార్జున అన్నారు. సభలో డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. స్ట్రోక్, హార్ట్ ఎటాక్, గుండెనొప్పి, అధిక రక్తపోటు, గుండెపోటు, గుండె దడ, గుండె పెరుగుదల తదితర గుండెజబ్బులు, వాటి చికిత్సల గురించి తెలియజేశారు. గుండె జబ్బులకు ప్రథమ చికిత్స అవసరమన్నారు. ఈ వ్యాధికి షుగర్, కర్తపోటు, ధూమపానం, వంశపారంపర్యం, మానసిక ఆరోగ్యం వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఛాతిలో అసౌకర్యంగా ఉండటం, వీపు, మెడ, దవడ, పొట్ట, చేతిలో నొప్పి, శ్వాస మందగించటం, చెమటలు పట్టడం, వికారం, కొద్దిపాటి తలనొప్పి వంటివి గుండెపోటు రావటానికి లక్షణాలని చెప్పారు. చిన్న వయస్సులోనే గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉండాలంటే శరీరంలో కొవ్వు కణాల సంఖ్య తగ్గించుకోవాలని, ఊబకాయం ఏర్పడకుండా చూసుకోవా లన్నారు. మనం తినే ఆహారంలో పీచుపదార్థం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని అన్నారు.అనంతరం డాక్టర్ నాగార్జునను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రామచంద్రరావు, కెపి.రెడ్డి, సత్యనారాయణ ప్రసంగించారు.

ఉపాధ్యాయ బదిలీల గడువు పెంచండి : ఎస్‌టియు

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నటు వంటి ఉపాధ్యాయుల బదిలీల గడువు తేదీని మరో రెండు రోజులు పొడిగించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరు ఎస్‌టియు కార్యాలయంలో మోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలు మొత్తం గందరగోళంగా ఉన్నాయని, తక్షణ బదిలీల గడువు తేదీ మరో రెండు రోజులు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉపాధ్యాయుల సర్దుబాటు మ్యాపింగ్ ద్వారా జరిగిన లేక మరి ఏవిధంగా జరిగినా అదనపు పాయింట్లు కేటాయించాలని, రెండు సంవత్సరాల లోపు బదిలీ అయి ఉండి తిరిగి మళ్లీ ఇప్పుడు తప్పనిసరి బదిలీల్లోకి వస్తే అటువంటి వారికి పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రాధాన్యత క్రమాలు కొనసాగించాలని కోరారు.

బాదుడే బాదుడుకు స్పందన కరువు...

ఇదేం ఖర్మ అనుకుంటూ కొత్తగా ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నం

అనుమతులు లేకుండా టిడిపి కార్యక్రమాలు

దాడులను చేస్తే ఉపేక్షించేది లేదు

ఎమ్మెల్యే పిన్నెల్లి - మాచర్ల ఘటనలో క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి - నరసరావుపేట

టిడిపి అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని బాదుడే బాదుడుకు స్పందన కొరవడడంతో ఇదేం ఖర్మ అంటూ అనుమతులు లేకుండా ప్రజల్లోకి వెళుతున్నారని వైసిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు ప్రభుత్వ విప్ మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాచర్ల ఘటనలో గాయపడి పట్టణంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్తలను ఆదివారం ఆయన పరామర్శించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పిన్నెల్లి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ ప్రశాంత మాచర్లలో జూలకంటి బ్రహ్మారెడ్డి ద్వారా వివాదాలకు తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి తెరచాటు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో టిడిపి అధికారంలోకి రావడం కష్టమని తెలిసి భయంతో ఇటువంటి రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అవాకులు చవాకులు పేలడం మానుకోవాలన్నారు. మ్యానిఫెస్టోను 100 శాతం అమలు చేసిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక విధ్వంసాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమన్నారు. ఇటువంటి ఘటనలు దురదృష్టకరమని మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం అన్నారు. గాయపడిన వారిని ఆయన పరామర్శించారు. టిడిపి నాయకులు బడుగు వర్గాలపై దాడి చేశారని తెలిపారు.

సంఘటన శోచనీయం : ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

మాచర్ల ఘటన దురదృష్టకరమని అధికార, ప్రతిపక్ష పార్టీలు చేసే నిరసనలు పోలీసు అనుమతులతో జరగాలన్నారు. అనుమతులు తీసుకొని ఉంటే ఇటువంటి ఘటనలు జరగకుండా ఉండేవని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. క్షతగాత్రులను ఎంపీ పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ అధికార, లేదా ప్రతిపక్ష పార్టీలు ప్రజా శ్రేయస్సు కోసం పాటు పడాలని వివాదాలతో గొడవలతో రాజాకీయాలు చేయాలనుకోవడం తగదన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి తదితరులు

జీవో 270 చట్ట విరుద్ధం

- యడవల్లి భూముల అంశంలో బాధితులకు న్యాయం చేయాలి
- పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ప్రచారం

ప్రజాశక్తి - యడ్లపాడు

యడవల్లి భూముల విషయంలో మంత్రివర్గ తీర్మానం ఆధారంగా జారీ చేసిన చట్టవ్యతిరేకమైన జీవో 270ను వెంటనే రద్దు చేయాలని, బాధిత రైతులకు న్యాయం చేసి వారి హక్కులను, బలహీన వర్గాల భూమి అభివృద్ధి సొసైటీని కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రోశయ్య, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యడవల్లి దళితులు చేస్తున్న పోరాటానికి మద్దతు కూడగట్టడంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా మర్రిపాలెంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ యడవల్లి సొసైటీ భూములను మైనింగ్ శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో చెల్లదని, ఏ అవసరాల కోసమైనా ప్రభుత్వం భూమి తీసుకోవాలంటే భూసేకరణ చట్టం-2013 ప్రకారమే తీసుకోవాలని చెప్పారు. గ్రామ సభలు నిర్వహించి మార్కెట్ ధరకు మూడు రెట్లు అదనంగా పరిహారం ఇచ్చాకే భూములు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. దళితుల అసైన్మెంట్ భూమిని కొనుగోలు చేశామనే పేరుతో కొందరు ప్రభుత్వం ఇచ్చిన పరిహారాన్నీ అక్రమంగా కాజేశారని, వారిపై కేసు నమోదైనా అధికార పార్టీ అండ వల్ల పోలీసులు అరెస్టు చేయడం లేదని విమర్శించారు. దళితులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం నిలబడలేదనే విషయం ప్రభుత్వం గుర్తించాలని, యడవల్లి సొసైటీని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆ భూముల్ని సొసైటీ లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. వీటిపై ప్రభుత్వం 20వ తేదీలోగా నిర్ణయం తీసుకోకుంటే బాధితులు చేసే అన్ని రకాల పోరాటాలకు వ్యవసాయ కార్మిక సంఘం మద్దతుగా నిలిచి ఉద్యమిస్తుందని ఉద్ఘాటించారు.

వడ్డెర సంక్షేమ బోర్డు సభ్యునిగా కొమెర

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్



కొమెర వీరాంజనేయులు

పల్నాడు జిల్లా వడ్డెర సంక్షేమ బోర్డు సభ్యులుగా సత్తెనపల్లి మండలం రెంటపాళ్లకు చెందిన కొమెర వీరాంజనేయులును నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరాంజనేయులను వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వడ్డెర కార్పోరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతికి వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మిక ద్రోహులకు బుద్ధి చెబుతాం

- కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి
- సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి
- సిఐటియు పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ ప్రారంభంలో రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు
- కార్మికుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు ఆర్.పురుషోత్తం





బహిరంగ సభలో మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు, గుంటూరు విజయ్‌కుమార్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

కార్మిక వర్గానికి ద్రోహం చేసే ఎవరికైనా బుద్ధి చెప్పే తీరుతామని, కార్మికుల హక్కుల కోసం సిఐటియు నికరంగా పోరాడుతుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రథమ మహాసభ ప్రారంభం సందర్భంగా ఆదివారం వినుకొండ పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్ నుండి శివయ్య స్తూపం సెంటర్ వరకూ అన్ని రంగాల కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శివయ్య స్తూపం సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అధ్యక్షత వహించగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కరోనా సమయంలో అనేక రంగాల కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని, మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల పరిహారం ఇస్తానని ప్రకటించిన మోడీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. రోజుకు రూ.175 ఇస్తూ శ్రమ దోపిడీ చేస్తున్నారని, ఇదే సమయంలో దేశ సంపదను అంబాని, అదాలనీలకు దోచిపెడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలనూ అమ్మేస్తున్నారని, ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు అమ్మకంపై నిలదీయాల్సిన రాష్ట్రంలోని ముగ్గురు పెద్దలూ మోడీ జపం చేస్తున్నారని ఎద్దేవ చేశారు. సమాన పనికి సమాన వేతనం వాగ్దానం చేసిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు కాంట్రాక్ట్ - ఔట్సోర్సింగ్ కార్మికులపై కత్తిగట్టారని మండిపడ్డారు. సిపిఎస్ అంశంలోనూ ఉద్యోగులను మోసం చేశారని ప్రశ్నించినందుకు నిర్బంధాలకు పాల్పడుతూ బహుముఖ రూపాల్లో వేధిస్తున్నారని విమర్శించారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వెలిబుచ్చారు. కార్మికుల హక్కుల రక్షణతోపాటు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇందుకోసం అన్ని రంగాల కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, రాష్ట్ర కమిటీ కమిటీ సభ్యులు గుంటూరు విజయకుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ పల్నాడులోని నాలుగు మండలాలకు, 400 గ్రామాలకు తాగు, సాగునీరు అందించే వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం ఒక్క అడుగూ ముందుకేయకపోవడం పాలకుల అసమర్థతకు నిదర్శనమన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండి ప్రమాదాలు వాటిల్లుతున్నాయని, ఆటో కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే రూ.10 వేలు వాహనాల మరమ్మతుకే సరిపోవడం లేదని విమర్శించారు. అంగన్వాడి, ఆశ, విఆర్‌ఎ తదితర అన్ని రంగాల్లో కార్మికులు, ఉద్యోగులపై ప్రభుత్వం పని ఒత్తిడి పెంచిందని, ఇది తట్టుకోలేక ఇటీవల సచివాలయంలో ఓ సర్వేర్ ఆత్మహత్య చేసుకున్నారని గుర్తు చేశారు. ఆకాశాన్నం టుతున్న ధరలను నియంత్రించాల్సిన పాలకులు మరిన్ని భారాలను ప్రజలపై మోపుతున్నారని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో కార్మికులు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి డి.శివకుమారి, సహాయ కార్యదర్శి జి.మల్లేశ్వరి, ఆహ్వాన కమిటీ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, ఎ.ఆంజనేయులు, షేక్ నాసర్‌బి, రంజాన్‌బి, ఎం.తిరుమల లక్ష్మి, యుటిఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు ఎం.రవిబాబు, కార్మికులు ఉద్యోగులు భారీగా పాల్గొన్నారు.

కార్మికులందర్నీ ఏకతాటిపైకి తేవాలి

పల్నాడు జిల్లాలో మూడున్నర లక్షల మంది కార్మికులున్నారని, వారందర్నీ ఏకతాటిపైకి తెచ్చి పోరాటాలు నిర్వహించాలని కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. బహిరంగ సభ అనంతరం గుంజరి ఏసు నగర్ (గుర్రం జాషువా కళా ప్రాంగణం)లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా జెండాను సీనియర్ నాయకులు ఆర్.పురుషోత్తం ఆవిష్కరించారు. అమరులకు నివాళుల అనంతరం నిర్వహించిన సభకు అధ్యక్ష వర్గంగా కె.హనుమంతరెడ్డి, జి.మల్లీశ్వరి, సలోమి వ్యవహరించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడి, వాటిని తిప్పికొట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. వివిధ అంశాలపై ప్రతినిధులు చర్చించారు.

ఆధార్ మార్పులు 31లోపు చేయించుకోవాలి

- పల్నాడు జిల్లాలో 61 కేంద్రాలు
- సమస్య ఉంటే 1947 నంబర్‌కు ఫోన్ చేయండి
- సమీక్షలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్



మాట్లాడుతున్న యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మేనేజర్ భాస్కర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులకు సంబంధించిన నమోదును 31వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. ఆధార్ జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ విసి హాలులో శనివారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 2023 నుండి ఆధార్ కార్డు సేవల్లో మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేషన్ కోసం రసుం వసూలు చేస్తారని, 5 నుండి 7 ఏళ్లలోపు మార్పులు ఒకసారి ఉచితంగా చేస్తారని తెలిపారు. అనంతరం మాత్రం నిర్ణీత ఛార్జీలు ఉంటాయన్నారు. 15-17 ఏళ్ల వారు ఉచితంగా 17 ఏళ్ల తర్వాతైతే ఛార్జీలతో సరి చేసుకోవచ్చని తెలిపారు. ఈ సేవలు, ధరల పట్టిక ఆయా ఆధార్ కేంద్రాల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో విధిగా ప్రదర్శించాలని చెప్పారు. జిల్లాలోని 61 ఆధార్ కేంద్రాల్లో అవసరమైన పరికరాలు ఉన్నాయా? అని అడిగారు. ఆధార్ సేవలపై ప్రతి 15 రోజులకు ఒకసారి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా మేనేజర్ భాస్కర్‌ను కోరారు. 2015 సంవత్సరానికి ముందు ఆధార్ కార్డు పొందిన వారు తమ వివరాలు, పేరు, చిరునామా తదితరాలను మరోసారి అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఆధార్ కార్డ్ కేంద్రం ఏర్పాటుకు అనువైన వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కలెక్టరేట్ ప్రాంగణంలో లేదా చుట్టుపక్కల ప్రాంతాల్లో గుర్తించి ఇవ్వాలని డిఆర్ఓ వినాయకంను ఆదేశించారు. ఆధార్ కార్డుకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబరు 1947కు కాల్ చేయవచ్చని సూచించారు. అనంతరం ఆధార్ లింక్డ్ బర్త్ రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆధార్ సేవలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి శోభారాణి, డిఆర్‌డిఎ పీడీ బాలునాయక్, ఎల్‌డిఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుబేరులకే మోడీ ప్రభుత్వం పెద్దపీట

- అడ్డగోలుగా ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ
- సిఐటియు గుంటూరు జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు



జెండా ఆవిష్కరిస్తున్న జెవి రాఘవులు, ఇతర ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

కోవిడ్ ప్రభావంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయి, ఇప్పటికీ కోలుకోలేని పరిస్థితులో ఉంటే ప్రధాని మోడీ మిత్రుడు అదాని మాత్రం ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానానికి చేరుకున్నాడని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్.వి. నరసింహారావు అన్నారు. సిఐటియు గుంటూరు జిల్లా 10వ మహాసభ ఆదివారం స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో ప్రారంభమైంది. రెండ్రోజులపాటు జరిగే ఈ మహాసభల ప్రారంభ సూచికగా సిఐటియు పతాకాన్ని సీనియర్ నాయకులు జె.వి.రాఘవులు ఆవిష్కరించారు. అమరవీరుల చిత్రపటాలకు ఆర్‌వి నరసింహారావు, ఇతర నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ డబుల్ ఇంజిన్ సర్కారు అని చెప్పుకుంటూ మోడీ అమిత్‌షాలు అదానీ, అంబానీలకు అనుకూలమైన విధానాలు అవలంబి స్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం లాభనష్టాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడి దారులకు అప్పగిస్తుందన్నారు. కేరళలోని త్రివేంద్రం విమానాశ్రయాన్ని కేరళ వామపక్ష ప్రభుత్వం నిర్వహిస్తామని చెప్పినా కేంద్రం మాత్రం అదానీకి అప్పగించిందని తెలిపారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వంతపాడుతుందని విమర్శిం చారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి గత మూడు సంవత్సరాల కాలంలో సిఐటియు, అను బంధ సంఘాలు నిర్వహించిన కార్యక్రమా లకు సంబంధించిన కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం రంగాల వారీగా కార్మికులు నివేదికపై చర్చల్లో పాల్గొన్నారు.మహాసభలకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, కట్లకుంట శ్రీనివాసరావు, టి.రాధ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి యం.బాలకాశీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.లక్ష్మణరావు, నన్నపనేని శ్రీనివాసరావు, బి.ముత్యాల రావు, ఎస్ఎస్ చంగయ్య, వి.దుర్గారావు, షేక్.హుస్సేన్‌వలి, ఎం.భాగ్యరాజు, టివిజి రవిశంకర్, యం.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ సౌహార్ద సందేశమిచ్చారు.

పలు తీర్మానాలు ఆమోదం..

మహాసభల్లో కార్మిక, ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని, మోటారు వాహనాల జిఒ 21 రద్దు చేయాలని, దారి మళ్లించిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు తిరిగి జమ చేయాలని, ముఠా కార్మికులకు సామాజిక భద్రతతో కూడిన చట్టం చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పైనా, రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర తీర్మానాలు ఆమోదించారు.

ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలి

ఎపిజిఇఎ ద్వితీయ కౌన్సిల్ సమావేశాల్లో సూర్యనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల హక్కుల సాధన కోసం రాబోయే కాలంలో పెద ఎత్తున ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఎపిజిఇఎ జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశం ఆదివారం ప్రభుత్వ మెడికల్ కాలేజి ప్రాంగణంలోని జింకానా ఆడిటోరియంలో జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా అధ్యక్షతన నిర్వహించారు.సభలో సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాల పేరుతో ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తుందని చెప్పారు. పీఆర్‌సిలో అన్యాయం జరిగిందని, ఉద్యోగులు ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయారన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంతు ఆస్కార్‌రావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర హామీలు అమలు అవుతాయనే విశ్వాసాన్ని ప్రభుత్వమే వమ్ము చేసే ధోరణి ఉందన్నారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాలను చర్చల పేరుతో సాగదీస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా మాట్లాడుతూ ప్రభుత్వం పట్ల ఉద్యోగ వర్గం తీవ్ర అసంతృప్తితో ఉందని, ఉద్యోగుల కోపాగ్నికి గురికాక ముందే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తొలుత స్థానిక నగరంపాలెంలోని ఎస్‌బిఐ నుండి ఉద్యోగులు భారీ ర్యాలీగా, రాష్ట్ర నాయకులకు ఘనస్వాగతం పలికి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఏపీజీఏ నాయకులు రాంకుమార్, నాగ సాయి శ్రీకాంత్ రాజు, బాబాసాహెబ్ శ్రీనివాసరావు కిషోర్, జిల్లా కార్యదర్శి శివారెడ్డి, గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్, గుంటూరు జిల్లా అధ్యక్షులు మణికంఠ, ఏపీజిఏ నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, నాయకులు

పారిశుధ్య కార్మికులకు పనిభద్రత కల్పించండి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు వినతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని పారిశుధ్య కార్మికులకు జనవరి నుండి పారిశుధ్య పనులు కొనసాగించే లా, పని భద్రత కలిపించి, అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోకి తీసుకునే విధంగా చేసి రాజధాని పారిశుధ్య కార్మికులకు, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఆదివారం సాయంత్రం గుంటూరులో ఎమ్మెల్సీ నివాసంలో సంఘం నాయకులు మాణిక్య వర ప్రసాద్‌ను కలిశారు. రాజధాని పారిశుధ్య కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా కార్మికులకు న్యాయం చేస్తామని డొక్కా మాణిక్య వరప్రసాద్ హామీ ఇచ్చారని, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి తెలిపారు. జనవరి నుండి రాజధాని కార్మికులను పారిశుధ్య విధుల నుండి తొలగిస్తే 400 కుటుంబాలు కొత్త సంవత్సరంలో రోడ్డున పడతాయని, కార్మికులందరూ నిరుపేద కుటుంబాలకు చెందిన దళిత ,గిరిజన బలహీన వర్గాల వారేనని కార్మిక సంఘం నేతలు తెలిపారు. పారిశుధ్య కార్మికులు ఉద్యోగులంటూ భూమిలేని పేదలకు రాజధాని గ్రామాల్లో ఇస్తున్న సామాజిక పెన్షన్ కూడా నిలిపివేశారని, నిలిపివేసిన పెన్షన్ కూడా కార్మికులకు పునరుద్ధరించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ ని కోరారు. రెండు నెలల జీతాలు ఇంకా పెండింగ్ ఉన్నాయని, పిఎఫ్ సక్రమంగా జమ చేయడం లేదని, వీటి గురించి కూడా సి ఆర్ డి ఏ కమిషనర్ తో మాట్లాడి ఇప్పించాలని ఎమ్మెల్సీని కార్మిక సంఘం నేతలు కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కాపు శ్రీనివాసరావు, రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు చెరుకూరి సుశీల, రాచూరి వేణు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ డొక్కాకు వినతి పత్రం ఇస్తున్న ఎం.రవి తదితరులు

మిట్టపల్లి ఆగ్రో ప్రొడక్ట్స్ సహకారంతోప్రభుత్వ మహిళా కళాశాలలో

తరగతి గదులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుంటూరు

మిట్టపల్లి ఆగ్రో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.25 లక్షల వ్యయంతో స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) ఆవరణలో కామర్స్ బ్లాక్ లో తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశ్రామిక వేత్త మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ తాను ఉన్నత విద్యావంతుణ్ణి కాలేకపోయినా తన భార్య, కీర్తిశేషులు సువర్ణ జ్ఞాపకార్థం విద్యార్థినుల కోసం ఆర్థిక సహకారం అందించే అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి.రమా జోత్స్నకుమారి మాట్లాడుతూ 8 దశాబ్దాల ప్రభుత్వ మహిళా కళాశాల అభివద్ధిలో ప్రభుత్వంతోపాటు దాతలు తమ సంపూర్ణ సహకారం అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో అమీర్నేని నరేష్ ప్రియాంక, పూజిత, కొణిజేటి జయశ్రీ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నిర్మల, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.త్యాగరాజు, జెకెసి కోఆర్డినేటర్ అపర్ణ పాల్గొన్నారు.



పాలపర్రులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నందమూరి తారకరత్న

త్వరలో రాజకీయాల్లోకి..

మహిళలకు ఆస్తిలో సగం హక్కు ఎన్టీఆర్ పుణ్యమే

పాలపర్రులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో నందమూరి తారకరత్న

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

పేదవాడికి గూడు కూడు గుడ్డ అనే నినాదంతో పాటు మహిళలకు ఆస్తిలో సగభాగం హక్కు కల్పించిన మహోన్నత వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ ఎన్టీఆర్ అని ఎన్టీఆర్ మనవడు సినీనటుడు నందమూరి తారకరత్న అన్నారు. ఆదివారం రాత్రి పెదనందిపాడు మండలం పాలపర్రులో తెలుగుదేశం పార్టీ అభిమానులు ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాతయ్య స్ఫూర్తితో తాను త్వరలో రాజకీయ రంగ ప్రవేశం చేయ ను న్నట్లు ప్రకటించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేస్తా నన్నారు. తారకరత్నకు తొలుత పెదనందిపాడు నుండి నర్రా బాలకృష్ణ ఆధ్వర్యంలో పాలపర్రు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వారి వెంట మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెద రత్తయ్య, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తిని జయలక్ష్మి, మాజీ ఎంపీపీ నాగరాజుకుమారి, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రాయపాటి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఇనగంటి జగదీష్ బాబు, విక్రయాల సుబ్బారావు, హర్ష, నాగార్జున, నాగమల్లేశ్వరరావు, టిడిపి జిల్లా మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.



డేవిడ్ రాజును, వక్తలను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ

వెస్టన్ డ్యాన్సర్ డేవిడ్ రాజుకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్: శకపురుషుని శతజయంతి పేరిట మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీర్ శతజయంతి ఉత్సవాల్లో బాగంగా ఎన్టీఆర్ వ్యక్తత్వంపై ఆదివారం స్థానిక కొత్తపేట పెన్షనర్స్ హోమ్‌లో చర్చ జరిగింది. ముఖ్యవక్తలుగా భట్టు రామకృష్ణ, బేతాళ మురళి పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ నటుడుగాను, రాజకీయ వేత్తగాను ఎంతో గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ సందర్భంగా వక్తలతో పాటు ప్రముఖ వెస్టన్ డ్యాన్స్ మాస్టర్ డేవిడ్ రాజును సత్కరించారు. కార్యక్రమంలో వెలగా సుభాష్‌చంద్రబోస్, దేవరపల్లి భవాని, జగన్, ఎం.రాఘవరావు, జి.సురేష్, పిఎం భాషా, షరీఫ్‌ఖాన్, బడే నాగరాజు పాల్గొన్నారు.



సమగ్ర భూ సర్వేను ప్రారంభించిన ఎమ్మెల్యే


ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షా పథకంలో భాగంగా ఆదివారం మండలంలోని శివాపురం, నాగులవరం గ్రామం సర్వే నిర్వహించారు. సమగ్ర భూ సర్వే చేసి, సరిహద్దులను గుర్తించి హక్కు దారుకు సమగ్రమైన వివరాలతో కూడిన పత్రం అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ప్రారంభించారు. బ్రిటిష్ కాలంలో జరిగిన సర్వే రికార్డులతో నేడు బలహీన రైతులు పేదలు ఇబ్బంది పడుతున్నారని సమగ్ర భూ సర్వే నిర్వహించి హక్కుదారులకు అప్పగించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్‌లో తారుమారు చేసే అవకాశాలు లేకుండా, ఈ భూ సర్వే ద్వారా రైతులు, భూ యజమానులు భద్రంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరానగర్ కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కారెంపూడి

మండల కేంద్రమైన కారెంపూడిలోని ఇందిరా నగర్ కాలనీ లో సోమవారం విద్యుత్ ను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ అధికారి కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ట్రాన్స్ఫార్మర్ లో మర్మమతులు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ విషయమై కాలనీ వాసులు విద్యుత్ శాఖ కు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



లేమల్లెలో పేదలకు దుస్తుల పంపిణి

ప్రజాశక్తి-అమరావతి

క్రిస్మస్‌ను పురస్కరించుకుని మండల పరిధిలోని లేమల్లెలో 4000 మంది పేద లకు ఉచితంగా దుస్తులను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదిన సందర్భంగా లేమల్లే గ్రామ మాజీ సర్పంచ్ మేకల చిన్న చెంచు పేదలకు దుస్తులు పంపిణి చేయడం, ఈ కార్యక్రమా నికి విచ్చేసిన వారందరికి అన్నదానం చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా పేద లకు సేవ చేయాలన్న ఆలోచన శుభపరిణామన్నారు.

నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి- యడ్లపాడు

మండలంలోని బోయపాలెంలో గోపాలపురంలోని కుష్టు వ్యాధి కాలనీవాసులు 85 మందికి అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దైవసేవకురాలు ఎస్తేరురాణి ఉచితంగా నూతన వస్త్రాలను ఆదివారం పంపిణీ చేశారు. క్రిస్మస్ ను పురస్కరించుకుని వృద్ధులు, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశామని ట్రస్టు నిర్వాహకులు అల్లడి శ్రీనివాస్ తెలిపారు. ఈ కాలనీ వాసులకు సుమారు రూ. 25 లక్షల వ్యయంతో విద్య, వైద్య సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కనీస సదుపాయాలు కరువు!



- చిలకలూరిపేట ప్రధాన శ్మశానం వెనుక భాగాన నివసించే ప్రజల ఆవేదన
- తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాల్వలు వంటి కనీస సౌకర్యాలూ లేని వైనం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని ధనిక-పేద వర్గాల వ్యత్యాసం మున్సిపల్ అధికారులు చూపిస్తున్నారని ఊరి బయట కాలనీలలో నివాసం ఉంటున్న ప్రజలు విమర్శిస్తు న్నారు. వివరాల్లోకి వెళితే.. కళా మందిరం సెంటర్ నుంచి పెదనందిపాడుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన, పట్టణ ప్రధాన శ్మశానం వెనుక భాగాన నివసించే ప్రజలకు మౌలిక సదుపాయాలు కూడా కరువైపోయాయి. దాసరి కాలనీ మొదటి బజారులో నివసిస్తున్న బుడబుక్కల సామాజిక వర్గానికి చెందిన నిరుపేద, పేద ప్రజలు, నిత్యం కూలీ పనులు చేసుకుని జీవసం సాగిస్తుం టారు. ఆ కాలనీలో తాగునీరు, విద్యుత్, రోడ్లు, కాలువలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక పోవడం దా ం ు ణ ం . మురుగునీరు, చెత్త, వ్యర్థపదా ర్థాల వల్ల విపరీతమైన దుర్వాసన వెదజల్లు తోందని, భరించలేక పోతున్నామని వారు వాపోతున్నారు. మున్సిపాలిటి అధి కారులు కనీసం కన్నెత్తి చూడడం లేదం టున్నారు. బ్లీచింగ్, ఫాగింగ్, మురుగునీరు పారుదల, దోమల నివా రణకు చర్యలు చేపట్టాలని 12,13వ వార్డుల ప్రజలు కోరుతున్నారు. వర్షా కాలంలో చెరువులను తలపించే కుం టల పక్కనే నివసించాల్సి వస్తోందన్నారు.





అధికారులు స్పందించాలి

రిక్షా పుల్లర్ దేవరకొండ వీరాస్వామి మాటల్లో .. మున్సిపల్ శ్మశానవాటికకు వెనుక భాగాన, చార్లెస్ కాన్వెంట్ నుంచి తూర్పు మాలపల్లిలోకి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే నివసిస్తున్న తమ ప్రాంతంలో రోడ్లు లేవని, మురుగునీరు పోయేందుకు కాల్వలు లేవు. ఇప్పటికైనా సంబంధిత వార్డు కౌన్సిలర్, మున్సిపల్ అధికారులు, ఉన్నతాధికారులు స్పందించి మౌలిక సదు పాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నా.



పట్టించుకోవడం లేదు..

12వ వార్డు సిపిఎంకు చెందిన మాజీ కౌన్సిలర్ సాతులూరిబాబు మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఈ కాలనీల్లో రోడ్లు, కాల్వలు, విద్యుత్, మంచినీరు మొదలైన సమస్యల పరిష్కారం కోరుతూ అనేక మార్లు వార్డు సచివాలయంలో అర్జీలు ఇచ్చామన్నారు. పలుమార్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, నిరసన వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎన్ని అర్జీలు పెట్టినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికైనా12వ వార్డులో శ్మశానం చుట్టూ ఉన్న కాలనీలకు మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు.



కనీససౌకర్యాలు కల్పించండి

దాసరి కాలనీలో దాసరి, రాజన్న కులాల వారు, చెంచులు నివసించే ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్యలోకి నీరు చేరిందని, విషప్రాణులు తిరుగుతున్నాయని దాసరి సంఘం రాష్ట్ర కన్వీనర్ తుపాకుల అప్పారావు అన్నారు. చెత్తపన్ను వేస్తున్న మున్సి పాలిటి వారు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. తక్షణమే కనీససౌకర్యాలు కల్పించాలని కోరారు.



అనారోగ్యంతో మున్సిపల్ కార్మికుడి మృతి

సిఐటియు నాయకుల నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుడు పిట్టా నాల్గవ రోశయ్య(50) అనారోగ్యంతో మృతి చెందాడు. గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రోశయ్యను గుంటూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోశయ్య ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. సత్తెనపల్లి లోని స్వీపర్స్ కాలనీలోని తన నివాసానికి మృతదేహాన్ని ఆదివారం ఉదయం తరలించారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి, సిఐటియు నాయకులు అవ్వారు ప్రసాద్ రావు, ఎం.హరిపోతురాజు, జడ రాజకుమార్ ,షేక్ సైదులు, ఆర్.పురుషోత్తంలు ఆయన మృతదేహాన్ని సంద ర్శించి నివాళులర్పించారు. రోశయ్యకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రోశయ్య మృతదేహాన్ని సందర్శించిన వారిలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చింతకుంట్ల వెంకన్న వెంకయ్య, మేడి సత్యవతి, మున్సిపల్ కార్మికులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకలు (ఇన్‌సెట్) రోశయ్య

విహార యాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం

వాసవి హైస్కూల్ డైరెక్టర్ అనిల్ కుమార్

ప్రజాశక్తి - వినుకొండ

విజ్ఞాన విహార యాత్రలు విద్యార్థులలో మానసిక పునరుత్తేజానికి దోహదం చేయడంతో పాటు విజ్ఞానం కలుగుతుందని వాసవి హైస్కూల్ డైరెక్టర్ నాగోతు అనీల్ కుమార్ అన్నారు. పట్టణంలోని విష్ణుకుండి నగర్ లో గల వాసవి హైస్కూల్ విద్యార్థులు ఆదివారం చారిత్రాత్మక కొండవీడు కోటను సందర్శించారు. ఈ సందర్భంగా అనీల్ మాట్లాడుతూ కొండవీడు కోటకు సంబంధించిన నాటి చరిత్రకు అద్దం పడుతూ ఉన్న కళా రూపాలు ద్వారా కొండవీడు కోట విశేషాలను విద్యార్థులకు వివ రించామని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు ఆటపాటలకు విజ్ఞాన విహార యాత్రలకు ప్రాధాన్యత ఇస్తు న్నామని పేర్కొన్నారు. పాఠశాల స్థాపించినప్పటి నుండిప్రతి ఏడాది విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రలకు తీసుకువెళు న్నామని పేర్కొన్నారు. తమ పాఠశాల ప్రశాంత వాతావరణంలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఇస్తున్నట్లు అనీల్ కుమార్ పేర్కొన్నారు.



కొండవీడుకోటలో విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం



జాన్‌పాల్‌ను పరామర్శిస్తున్న పిల్లి మాణిక్యరావు

ఎండియూ ఆపరేటర్ ఆత్మహత్యాయత్నానికి బాధ్యులపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-తెనాలి

వైసిపి ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, వారి వేధింపులకు సొంత పార్టీవారు కూడా మినహాయింపు కాదని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యరావు అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన ఎండియూ ఆపరేటర్ కె.జాన్‌పాల్ పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసి తెనాలి జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఆయ నను మాణిక్యరావు పరామర్శిం చారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ బాధితుడు వైసిపికి చెందినవాడైనా అదే పార్టీ నాయ కులు వేధించడం బాధా కరమన్నారు. ఏదైనా జరగరానిది జరిగితే అతని కుటుంబానికి దిక్కెవరని ప్రశ్నించారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి, బాధితుడి సెల్ఫీవీడియో ఆధారంగా బాధ్యులపై సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు కె.ఏడుకొండలు, అత్తోట శరత్ తదితరులు ఉన్నారు.



మహిళల అభ్యున్నతే బీసీ జేఏసీ లక్ష్యం

ప్రజాశక్తి-మంగళగిరి

రాజకీయాల్లో మహిళల ముందుకు రావాలని బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జేఏసీ నాయకులు మహిళ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణ మహిళా అధ్యక్షురాలుగా కాట్రు గాయత్రికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ మహిళలు స్వతహాగా సేవా భావం కలిగిన వ్యక్తులని, అటువంటివారు రాష్ట్ర రాజకీయాల్లో సైతం పాల్గొని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షురాలుగా కాట్రు గాయత్రితో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం గాయత్రి మాట్లాడుతూ టైలరింగ్ వృత్తి ద్వారా ఎంతో మందికి ఉచితంగా టైలరింగ్ మగ్గం వర్క్ లో శిక్షణ ఇస్తున్నానన్నారు. వృత్తి పరమైన సంతృప్తితో పాటు బీసీ వెల్ఫేర్ జేఏసీ ద్వారా పట్టణంలోని మరింతమందికి సేవా కార్యక్రమాలు నిర్వహిం చాలనే ఆలోచనతో జేఏసీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. తనను ఎంపిక చేసిన అధ్యక్షులకు కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ ఉపాధ్యక్షులు కె.జగన్‌మోహన్‌రావు, పట్టణ అధ్యక్షులు పూట్ల పాల శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు కె.సత్యప్రసాద్, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసి డెంట్ ఆర్.నాగేశ్వరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ధనలక్ష్మి జేఏసీ నాయకులు వింజమూరు వాసు, డి.ఉమా మహే శ్వరరావు, ఎస్.కె చిన్న,కె.చాంద్, టి. శ్రీనివాసరావు, విజయలక్ష్మి ,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుకగా చీరలు పంపిణి


ప్రజాశక్తి - మంగళగిరి: క్రిస్మస్ కానుకగా స్థానిక పార్కు రోడ్డులోని ఇమ్మానుయేలు చర్చిలో ఆదివారం పాస్టర్ బొంతపురి రవి ప్రకాష్ వృద్ధులు, విధవరాండ్రకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చిల ఆధ్వర్యంలో దాతృత్వ కార్య క్రమాలు నిర్వహించడం ద్వారా ప్రేమ, జాలి, దయ, కరుణ, అందరూ అల వర్చుకోవడానికి దోహద పడు తుందన్నారు. ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్య క్రమంలో బి.అచలరాణి, ఎం. ప్రశాంత్, బి.దేవరాజు, ఎన్.విమ లమ్మ, పి.మరియమ్మ, బి.ఆరో గ్యమ్మ, ఎ.ఆలీసమ్మ, ఎన్.దేవి, ఎం.వాణి పాల్గొన్నారు..

అంతర్జాతీయ స్థాయికి 'లెన్స్ మ్యాన్' శ్రీనివాసరెడ్డి

- ఫొటోగ్రఫి రంగంలో ఓ వెలుగు
- దేన్నయినా సరే సవాలుగా తీసుకునే వ్యక్తి
- నడుస్తున్న చరిత్రకు ఆయన ఫొటోలు ఆనవాళ్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన తమ్మా శ్రీనివాసరెడ్డి ఫొటోగ్రఫీ విభాగంలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. ఆయన తీసిన పలు ఫొటోలు ప్రపంచస్థాయిలో మంచి గుర్తింపు తెచ్చాయి. ఆయన తీసిన ఫొటో ఒకటి.. చిన్నప్పుడు తప్పిపోయిన బిడ్డను 17 ఏళ్ల తర్వాత ఆ తల్లి వద్దకు చేర్చింది. కష్టజీవుల వెతల దగ్గర నుండి యుద్ధ భయానక దృశ్యాల వరకు తనదైన శైలిలో కెమెరాలో బంధించి అంతర్జాతీయ గ్రాండ్ మాస్టరు అవార్డు అందుకున్నారు. అమెరికాలోని ఇమేజ్ కాలేజ్ సొసైటీ అందుకు వేదికైంది. ఫొటో గ్రఫీలోని తన ప్రతిభను దేశ, విదేశాలకు చాటి చెప్పిన ఓ విశిష్టమైన వ్యక్తి, లెన్స్ మ్యాన్ శ్రీనివాసరెడ్డి స్వస్థలం ఉండవల్లి. ఉండవల్లిలోని గుహలను అం దంగా బంధించిన జర్నలిస్ట్ శ్రీనివాస్ స్ఫూర్తితో తన ఊరి అందాలను ఛాయాచిత్ర కారుడిగా బంధించాలని దాని కోసం ఫోటోగ్రఫీ నేర్చుకోవాలని జర్నలిజం డిప్ల మోలో చేరారు. టిఎస్ రెడ్డి లోని ఆసక్తిని గమనించిన వారి అమ్మ, అప్పట్లో వారి రోజు కూలీ రూపాయిన్నర అయినప్పటికీ, రూ.650 పెట్టి బేసిక్ మోడల్ అయిన యాషికా కెమెరాను కొనిచ్చారు. దీంతో మొదలైన ప్రోత్సాహ ప్రస్థానం నేడు ప్రపంచంలోని కోటిన్నర విలువ గల అత్యుత్తమ హెజల్ బ్లేడ్ 5 డి కెమెరాను పొలం అమ్మి మరీ కొనివ్వడం వరకూ కొనసాగుతూనే ఉంది. దేన్నయినా సరే సవాలుగా తీసుకునే తత్వం గల శ్రీనివాసరెడ్డి కలర్, బ్లాక్ అండ్ వైట్, నేచర్, వైల్డ్ లైఫ్, ఫొటో ట్రావెల్, ఫొటో జర్నలిజం, వెడ్డింగ్, డాక్యుమెంటరీ మేకింగ్, పోర్ట్రెట్, పోర్ట్ పోలియో, అడ్వేర్టైజ్మెంట్ ఇలా అనేక విభాగాల్లో తన ప్రతిభను క్లిక్ మనిపించారు. నాగపూర్ యూనివర్సిటీలో చదువు వారి కళా నైపుణ్యాలను విశాలంగా చేసింది. 1991 నుండి 94 వరకు వరుసగా కేంద్ర సమాచార శాఖ నుండి అవా ర్డులు, 19 93లో ప్రపంచ ఫోటోగ్రఫీ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి తొలి బహుమతి, 2008లో ఎంఎ రహీం అవార్డు, 2016 ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ కళారత్న హంస పురస్కారం, 2008లో భారతదేశ అత్యుత్తమ రామ్ నాథ్ గోయంకా మెమోరియల్ అవార్డు, 2015 లో వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ ఇండియా అసోసియేషన్ నుండి సలీం అలి మెమోరియల్ అవార్డు, 2019 లో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫోటో గ్రఫీ సంస్థ నుండి అత్యున్నత మాస్టర్ అవార్డు, బ్రిటిష్ రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ పురస్కారం, ఇమేజ్ కొలీగ్ సొసైటీ - అమెరికా నుండి ఒకేసారి 7 అత్యుత్తమ గౌరవ పురస్కారాలతో ప్రపంచ రికార్డ్, అంతర్జాతీయ తొలి గ్రాండ్ మాస్టర్ అత్యున్నత అవార్డు. రెండు దశాబ్దాలుగా ప్రపంచ అత్యుత్తమ మొదటి పది మంది ఫోటోగ్రాఫర్ లలో ఒకరిగా గుర్తింపు. కోవిడ్ కష్టకాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కోవిడ్ వారియర్స్ చేసిన సేవలను ఛాయాచిత్రాలుగా బంధించినందుకు ఫోటోగ్రఫీలో నోబెల్ బహుమతిగా పరిగణించే ఎఫ్ఆర్‌పిఎస్ యుకె ఫెలో రాయల్ ఫోటోగ్రఫిక్ సొసైటీ పురస్కారం అందుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఫోటోగ్రఫీ అకాడెమీ అధ్యక్షత, ఇండియా ఇంటర్నేషనల్ ఫోటోగ్రఫీ కౌన్సిల్ కి ఫోటో జర్నలిజం విభాగ చైర్మన్, ఇమేజ్ లీగ్ సొసైటీ అమెరికా సంస్థకి 2023 వరకు చైర్మగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.





జాతీయ సాహితీ పురస్కారం అందుకున్న కవి ఆళ్ళ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ళ నాగేశ్వరరావు తెలుగు వెలుగు జాతీయ సాహితీ పురస్కారం-2022 అందుకున్నారు. తెలం గాణలోని వరంగల్‌కు చెందిన తెలుగు వెలుగు జాతీయ వేదిక ఆది వారం ఈ పురస్కారాన్ని ఆయనకు అందించింది. ఈ సందర్భంగా స్థానిక కొత్తపేటలోని రాధాకృష్ణ కల్యాణ మండపంలో నిర్వ హించిన కార్యక్రమంలో సంస్థ అధికార ప్రతినిధి రంగిశెట్టి రమేష్ చేతుల మీదుగా ఈ పురస్కారం ఆయన అందుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు మాట్లా డుతూ వృత్తి రీత్యా కండక్టర్ అయిన నాగేశ్వరరావు సాహితీ రంగంలో చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పురస్కార గ్రహీత రమేష్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలో భాషా వికా సానికి నాగేశ్వరరావు ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో సాహితీ వేత్తలు పెద్దేటి యోహాను, కాకరపర్తి సుబ్రహ్మణ్యం, విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, ఎం.వి రఘునాధరావు, షేక్ అబ్దుల్ హికీంజాని పాల్గొన్నారు.



ఆళ్ళ నాగేశ్వరరావును సత్కరిస్తున్న తెలుగు వెలుగు జాతీయ వేదిక బృందం

విద్యార్థులకు డిక్షనరీలు, బ్యాగ్‌లు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు

రజక బాల బాలికల విద్యాప్రచార అసోసియేషన్ ఆధ్వ ర్యంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుతున్న రజక పేద విద్యా ర్థులకు ఆదివారం డిక్షనరీలు, స్కూల్ బ్యాగ్స్, బెడ్ షీట్ అంద జేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అన్నదాన సత్రం అధ్య క్షులు పోకల వసంత్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా గవ ర్నమెంట్ లాయర్ పోకల వెంకటేశ్వర్లు హాజరై విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగాలని, ప్రస్తుతం అనేక అవకాశాలు ఉన్నాయని వాటన్నింటిని అంది పుచ్చుకోవాలని సూచించారు. అలాగే, రజక బాలబాలికల విద్యా ప్రోత్సాహక అసోసియేషన్ పేద విద్యార్థులకు ప్రోత్సాహాలు ఇవ్వటం అభినందనీయమ న్నారు.

కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నిడుబ్రోలు సాంబయ్య, రజక జనసేవ సం ఘం నాయకులు జూపూడి శ్రీనివాసరావు, రజక సం ఘం నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, శంకర్‌బాబు, వి.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని బాపూజీ నగర్ లో ఆదివారం ఉదయం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వ హించారు. డివైన్ మెర్సీ ధ్యానాశ్రమం ఫాతిమా మాత చర్చి ఆవ రణలో ఎండిసి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కూరపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల(విజయవాడ) ఈ వైద్యశిబిరం నిర్వహించింది.రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బిపి, షుగర్, కీళ్లవాతము, మోకాళ్ళ నొప్పులు పక్షవాతము, బొల్లి, పార్కినోసోనిజం, సయాటికా, సొరియాసిస్, మానసిక సమ స్యలు, రుతు, గర్భాశయ, అండాశయ తదితర సమస్యలకు రక్త పరీక్షలు నిర్వహించారు. సుమారు 300 మందికి ఉచితంగా మందులు పం పిణి చేశారు. కార్యక్రమంలో ఫాదర్ థామస్, సుపీరియర్ అండ్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చేబ్రోలులో గ్రాండ్ క్రిస్మస్

ప్రజాశక్తి - చేబ్రోలు

నేడు చేబ్రోలులో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చేబ్రోలు మండల పరిషత్ అధ్యక్షులు కె. సాహితీ కిరణ్ తెలిపారు. 19వ తేదీ సాయంత్రం నాలుగు గం టలకు చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకలు మండల ప్రజలను ఆహ్వానిస్తున్నామన్నారు.ముఖ్యఅతిథులుగా హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత , సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున , జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెనీ క్రిస్టినా , బాపట్ల ఎంపి నందిగం సురేష్ , ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి , ప్రత్తి పాడు ఎమ్మెల్యేలు మేకతోటి సుచరిత , మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.



దుర్మార్గపు ప్రభుత్వం గద్దెదిగాలి: టిడిపి

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

దళితులపై వరుసగా దాడులు చేసి వారి శవాలను డోర్ డెలివరీ చేస్తున్న ఈ దుర్మార్గపు వైసిపి ప్రభుత్వం గద్దె దిగి పోవాలని గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు వేమూరు మైనర్ బాబు అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్‌ను హతమార్చిన ఘటన గురించి టిడిపినాయకులు ప్రస్తా విస్తూ విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రత్తిపాడు మం డల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్య క్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వేమూరు మైనర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కరోనా టైం లో మాస్క్ అడిగినందుకు దళిత డాక్టర్ సుధీర్ బాబును నడిరోడ్డుపై కొట్టించిన దుర్మార్గ ప్రభుత్వమంటూ దుయ్యబట్టారు అంతేకాకుండా రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని, పరామర్శించడానికి వెళ్తుంటే అడ్డుకుంటు న్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో దళితుల అంతా ఒకటై దుర్మార్గపు ప్రభుత్వాన్ని గద్దె దించుతామని హెచ్చ రించారు అనంతరం ఈ ప్రభుత్వంలో దళితులను అంబేద్కర్, జగ్జీవన్‌రామ్‌లే కాపాడాలంటూ విగ్రహాలకు వినతిపత్రం అం దజేశారు. నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్ద రత్తయ్య, మండల అధ్యక్షులు గింజుపల్లి ప్రసాద్ రైతు మీడి యా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు మాజీ జెడ్పిటిసి భాగ్య రావు సుబ్బారెడ్డి ఎస్సీ సెల్ బసవ బాబు నవీన్ పాల్గొన్నారు.

విద్యావిభాగంలో విజయ్ కుమార్‌కు డాక్టరేట్



ప్రజాశక్తి - ఎఎన్‌యు : నగరంలోని పలు విద్యాసంస్థలలో గణిత శాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న జె విజయకుమార్ కు ఆచార్య నాగార్జున విశ్వావిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. 'ఇంపాక్ట్ ఆఫ్ లీడర్ షిప్ స్టయిల్స్ ఆఫ్ సెకండరీ స్కూల్ అడ్మినిస్ట్రేటర్స్ ఆన్ టీచర్ ఎఫెక్టివ్ నెస్ అండ్ స్టూడెంట్స్ అకడమిక్ అచ్చివ్ మెంట్' అనే అంశం పై ఆర్. వి. ఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ గుడివాడ ప్రభావతి ఆధ్వర్యంలో విజయ్‌కుమార్ పరిశోధనలు చేశారు. గైడ్ ప్రభావతి, విశ్రాంత డైట్ ప్రిన్సిపాల్ ఎస్. బి. జె. ఆర్. చౌదరి, సెయింట్ జోసెఫ్స్ కళాశాల ప్రిన్సిపాల్ స్వరూప రాణి, రీసెర్చ్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్. పి. కిరణ్మయి విజయకుమార్‌కు అభినందనలు తెలిపారు. వారికి విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



సూర్యదేవర గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సందేశ కావ్యాలకు ఆద్యుడు కాళిదాసు

ప్రజాశక్తి-గుంటూరు

సందేశ కావ్యాలకు కాళిదాసు ఆద్యుడని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.ఎన్.దీక్షిత్ తెలిపారు. 'అమరావతి సాహితీమిత్రులు' ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో డాక్టర్ సూర్యదేవర రవికుమార్ రచించిన 'మేఘ సందేశం..గేయానువాదం' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేఘ సందేశ కావ్య విశిష్టత వివరించారు. అనుభూతికి, రసానుభూతికి మేఘ సందేశం పెద్ద పీట వేసిందని, కాళిదాసు కతికి సరళ సుందర శైలిలో గేయానువాదం చేయడం వల్ల సామాన్యులకు కూడా కాళిదాసు కవిత్వ ఘనత తెలుస్తుందని సూర్యదేవరను ప్రశంసించారు. ప్రముఖ కవి పండితులు డాక్టర్ వుయ్యూరు లక్ష్మీ నరసింహారావు గ్రంథాన్ని సమీక్షించారు. సూర్యదేవర రాసిన మరో గ్రంథం పద్య కవితల సంపుటి 'మత్యుంజయ' ని ప్రముఖ సంస్కృత సాహితీవేత్త సుఖవాసి మల్లికార్జునరాయ శాస్త్రి ఆవిష్కరించారు. అమరావతి సాహితీమిత్రులు సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో ఈ మాసం కవిగా సంధుపట్ల భూపతి పాల్గొన్నారు. భూపతిని, సూర్యదేవర రవికుమార్‌ను ఈ సందర్భంగా సన్మానించారు.

ఉత్సాహంగా భాష్యం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న హేమ చంద్రారెడ్డి

స్థానిక భాష్యం గోరంట్ల, రామసేతు ప్లే గ్రౌండ్స్లో భాష్యమైట్స్ అల్యుమిని మీట్ రీకనెక్ట్ పేరుతో నిర్వహించిన పూర్వవిద్యార్థుల (2011 నుండి 2022వరకు ఐఐటి, ఎన్ఐటి మరియు ఐఐఐటి) ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో భాష్యం ఛైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ మా పై నమ్మకంతో విద్యార్థులను భాష్యంలో చేర్పించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తల్లిదండ్రుల నమ్మకంతోనే భాష్యం నేడు ఈ స్థాయిలో ఉందన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ప్రతి ఒక్కరితో కలసి రామకృష్ణ ఆత్మీయగా పలకరించారు. సభకు గౌరవ అతిధిగా విచ్చేసిన ఏపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ ఐఈఐ ఏపి స్టేట్ సెంటర్ ఛైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రరెడ్డి, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ యు. హరిప్రసాదరెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు తమ విజ్ఞానాన్ని, విజ్ఞతను ప్రస్తుత విద్యార్థులకు తమ బాధ్యతగా తీసుకొని నేర్పాలన్నారు.ఆర్‌టిఐ కమిషనర్ రామకృష్ణ మాట్లాడారు. ఎసిపి ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్ ఎన్ఆర్ఐ సెల్, నార్కోటిక్ సెల్ ఆఫ్ సిఐడి, ఏపి కెజివి సరిత మాట్లాడారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థ డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, మై ఖేల్, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, ఐఐటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిలలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-తాడేపల్లి



ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాడేపల్లి పట్టణంలోని సీతానగరం, రైలు బ్రిడ్జి వద్ద పోలీసులు ఆదివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఫూట్ పెట్రోలింగ్, వాహన తనిఖీల్లో భాగంగా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసినట్లు తాడేపల్లి సిఐ శేషగిరిరావు తెలిపారు. లైసెన్స్, త్రిబుల్ డ్రైవింగ్, సరైన పత్రాలు లేకుండా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. తాడేపల్లి మండలంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఫూట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో భాగంగా 9 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పలువురు వాహనదారులకు జరిమానా విధించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుంటూరు



చెకుముకి ప్రశ్నా పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ వేణుగోపాలరావు, చిన్నపరెడ్డి తదితరులు

విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకోవాలని రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు అన్నారు. స్థానిక నవీన విద్యాలయంలో ఆదివారం జెవివి జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నవీన విద్యా సంస్థల ఛైర్మన్ యేరువ చిన్నపరెడ్డి మాట్లాడుతూ సైన్స్ ఫలాలు సామాన్యులకు అందాలని, సైన్స్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా ఆలోచించే విధంగా కృషి చేస్తున్న జెవివి కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు.



జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మంగళగిరి బిఎన్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, తాడికొండ ఎపిఆర్ఎస్, గుంటూరు కొత్తపేటలోని కాసు శాయమ్మ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో సంగడిగుంటలోని కొండవీడు పబ్లిక్ స్కూల్, లాల్‌పురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్, తుళ్లూరులోని మేరీమాత సిబిఎస్ఇ స్కూల్ ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్, బి.ప్రసాద్, జి.వెంకటరావు, కుర్రా శ్రీనివాస్, షేక్.అహ్మద్ హుస్సేన్, టి.ఆర్.రమేష్, ఇ.రాధ, చాందిని, శంకర్‌సింగ్,ఫణికుమార్, ఆర్.శివనాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

సొంత భూముల్లో మొక్కలు పెంచుకోవచ్చు

సొంత భూముల్లో ఎవరైనా ఎటువంటి మొక్కలు పెంచుకోవచ్చునని జిల్లా సామాజిక అటవీశాఖ అధికారి కె. మహబూబ్ భాషా తెలిపారు. కొన్ని మొక్కలను పెంచినా వృక్షాలుగా మారిన తరువాత వాటిని కటింగ్ చేసే సమయంలోనే అటవీశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, సాధారణ చెట్లకు ఎటువంటి అనుమతి అవసరం లేదని ఆయన తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

- **నిషేధిత కలప విక్రయాలకు అనుమతి తీసుకోవాలి**
- **మంగళగిరి, పేరేచర్ల నగర వనాల అభివృద్ధి**
- **ఆయా శాఖలకే మొక్కల పెంపకం బాధ్యత**
- **ప్రజాశక్తితో జిల్లా సామాజిక అటవీశాఖాధికారి మహబూబ్ బాషా**





అటవీ అభివృద్ధి పథకాలు ఎలా ఉన్నాయి?

జిల్లాలో ప్రస్తుతం సామాజిక అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1.35 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉండేది. జిల్లాలు విడిపోయిన తరువాత అవిభాజ్య గుంటూరు జిల్లాలో కేవలం 4,800 హెక్టార్ల విస్తీర్ణంలోనే అటవీ ప్రాంతం ఉంది. ఇందువల్ల నూతనంగా అటవీ అభివృద్ధి పథకాలు లేవు. పల్నాడు, బాపట్లజిల్లాలో ఈ పథకాలు అమలు అవుతున్నాయి.

సామాజిక అటవీశాఖ తరుపున మొక్కల పంపిణీ చేస్తున్నారా?

ప్రస్తుతం తమశాఖ తరుపున మొక్కల పంపిణీ జరగడం లేదు. గతంలో తమ శాఖ అన్ని శాఖలకు సరఫరా చేసేది. ఇప్పుడు ఏ శాఖ వారు ఆశాఖే మొక్కలను సమకూర్చుకోవాలి. ఉపాధి హామీపథకం ద్వారా కూడా గతంతో తాము నర్సరీలను నిర్వహించే వారం. ఇప్పుడు లేదు. రహదారుల భవనాలశాఖ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ వారే మొక్కలను నాటుకుని సంరక్షించు కుంటారు. ప్రస్తుతం తమపరిధిలో ఉన్న 4,800 ఎకరాల అటవీ విస్తీర్ణం కూడా మంగ ళగిరి పరిధిలో ఉంది. మంగళగిరి, తాడేపల్లిలో ఉన్న కొండప్రాంతాల్లో ఉన్న అటవీ ప్రాంతమే జిల్లాలో మిగిలిన అటవీ ప్రాంతంగా ఉంది.

నగర వనాల నిర్వహణ ఎలా ఉంది?

మంగళగిరి, పేరేచర్లలో నగరవనాలను తామేనిర్వహిస్తున్నాం. ఇందుకు రూ.40 లక్షలు కేటాయించారు. వీటి నిర్వహణ తమ శాఖ సిబ్బంది చూస్తున్నారు. సందర్శకులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.

కటింగ్ చేయాలంటే ఏయే చెట్లకు అనుమతి తీసుకోవాలి?

శ్రీగంధం, ఎర్ర చందనం, టేకు,మహాగని తదితర చెట్లను తొలగించాలంటే తమ శాఖ అనుమతి తీసుకోవాలి. వేప,మామిడి, జామాయిల్, యూకలిప్టస్, సరుగుడు, ఇతర చెట్లను తొలగించడానికి అనుమతి అవసరం లేదు. నాలుగు హెక్టార్లు దాటితే మాత్రం అటవీశాఖ కన్జర్వేజర్ అనుమతి, 10 హెక్టార్లు దాటితే రాష్ట్ర అధికారుల అనుమతి తీసుకోవాలి.

వ్యవసాయ భూముల్లో మొక్కల వ్యాపారం సాగుతోంది?

ఎవరు అయినా తమ భూముల్లో ఎలాంటి మొక్కలను పెంచుకోవచ్చు. వ్యవసాయ భూముల్లో పంటలను తొలగించి కొన్ని మొక్కలను పెంచి వాటి ఫలసాయంపై కొంతమంది రియల్ ఎస్టేట్ వారు వ్యాపారం చేస్తున్న మాట వాస్తవమే. ప్రభుత్వం నిషేధిత సుగంధ ద్రవ్యాలకు సంబంధించిన చెట్లను మాత్రమే కటింగ్ చేయడానికి అనుమతి తీసుకోవాలి. మిగతా వాటికి అవసరంలేదు.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా సెమిక్రిస్మస్

ప్రజాశక్తి - గుంటూరు

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విద్యార్థుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని స్టూడెంట్ కౌన్సిలర్ గడ్డం సుధీర్ మాట్లాడుతూ జీవితంలో విద్యార్థులు భయానికి, ఆందోళనకు, ఒత్తిడికు గురికావద్దని పేర్కొన్నారు. సత్యం, ధర్మం, శాంతి, సహనం అనే ఆయుధాలను ఏసుక్రీస్తు ప్రపంచానికి అందించారన్నారు. ధర్మం కోసం అడుగులు వేసే ఎవరైనా సత్యాన్ని నిర్భయంగా ప్రకటిస్తారనేది క్రీస్తు జీవితం ద్వారా మనకు తెలుస్తుందని చెప్పారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్, ఎంపి లావు శ్రీకష్ణదేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పారు. క్రిస్మస్ పండుగ ఆచారాలకు సంబంధించిన పండుగ కాదని, ఇది ఆత్మీయతను పెంచే అనిర్వచనీయమైన అనుభవం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం వారు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు, గీతాలు, ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



